# నాన్న - ఒక వర్షం రోజు

"గోవర్ధనా... గోవర్ధనా... లలితమ్మా... లలితమ్మా..." బయట నాన్న పిలుస్తున్నాడు. దరోదరి (హోరాహోరి) వర్షం. అప్పటికి ఎదిరి చూస్తున్నాం. నాన్న ఇంకా రాలేదేందని. రాత్రి పదకొండు కావస్తుంది. పెద్దరువాజ దగ్గరికి ఎవ్వరు వెళ్ళి తలుపు తీసినా తడుస్తం. అయినా నాన్న పిలుపు విని అందరి మొహాలు వెలిగి పోయినయి.

"ఆ...ఆ..వస్తున్నా.." లేవబోయిన. కానీ, ఊళ్ళొ దయ్యాల ముచ్చట్లు విపరీతంగా జరుగుతున్నయ్.

బయటకు వెళ్ళడానికి భయమేసింది.

నాన్న పెద్దకలువలలో టీచరుగ పని చేస్తున్న రోజులవి. నాకు ఆరేడేళ్ళు. అత్తుళ్ళాయ్ (చెల్లెలు)కి నాలుగైదేళ్ళుండొచ్చు.

పెద్దకలువల నుంచి ప్రతి శనివారం రాత్రి వచ్చేవాడు నాన్న జూలపల్లికి. ఆదివారం మాతో గడిపి మళ్ళీ సోమవారం తెల్లవారంగ కల్వలకు వెళ్ళేవాడు. నేను, చెల్లి, అమ్మ, నానమ్మ జూలపల్లిలో ఉండేవాళ్ళం.

"నేను వస్త పద. తలుపు తీద్దాం" దుప్పటి కప్పుకొని నానమ్మ ముందు నడుస్తుంటె నేను వెనుక వెళ్ళిన.

"వస్తున్నం రామచంద్రయ్యా వస్తున్నం" నానమ్మ పెద్దగా చెబుతూ పెద్దర్వాజ (ప్రధాన ద్వారం) దగ్గరకు పోయి ఇద్దరం తలుపు తీసినం.

నాన్న వానకు తడిసి పోయిండు. నెత్తిమీద పెద్ద ముల్లెమూట. వగరుస్తూ లోపలికి వచ్చిండు.



Scanned with CamScanner

నాన్న టీచరుగ పని చేసినా నెత్తిన అట్లా ముళ్ళె పెట్టుకొని వచ్చేవాడు.

'మన పని మనం చేసుకుంటే తప్పేంది. మనమేమన్న మందివి మోస్తున్నమా ఏంది. మనవి మనం మోస్తున్నం' అనేవాడు నాన్న.

నాన్న పంచాంగం చెప్పేవాడు, జాతకాలు చూసేవాడు. పురాణాలు చెప్పడం కాదు గాని పురాణ కథలు చెప్పేవాడు. పెద్ద కలువలలో ధాన్యం, కూరగాయలు ఉచితంగా ఇచ్చేవారు.

అన్నీ తీసుకొని శనివారం రాత్రికల్లా మూట నెత్తిమీద పెట్టుకొని నడుచుకొంటూ వచ్చేవాడు. అప్పట్లో జాలపల్లికి బస్సు సౌకర్యం కూడా లేదు. ప్రయాణాలు కాలినడకన సాగాల్సిందే.

"నడుకాపురం దగ్గర అందుకొంది వాన. దీని తల్లి ముండమయ్య.. ఒకటే కుండపోత" తడిసిపోయిన బట్టలు మార్చుకొని ఆరబెట్టుకొంటూ అన్నాడు నాన్న.

"అప్పటి నుంచి చూస్తున్నం వస్తరని. ఆలస్యంగా బయలుదేరిండ్రా ఏంది" భోజనం సిద్ధం చేస్తూ అంది అమ్మ.

"ఆ... తయారవడం కొంచెం ఆలస్యం అయింది" పీటమీద కూర్చుంటూ అన్నాడు నాన్న.

నానమ్మ గబగబా నాన్న తెచ్చిన మూటలన్నీ విప్పింది. ధాన్యం, పప్పు, కూరగాయలే ఉన్నాయి. ఇంకో చిన్న మూట విప్పింది. నానమ్మ కళ్ళు మెరిసాయి. అందులో చక్కెర ఉంది.

పిడికెడంత చక్కెర తీసి నానోట్లో కుక్కింది. నా మూతి మీద పడ్డ చక్కెరను కొంగుతో దులిపింది, నాన్న చూస్తె తిడుతాడని.

బయట వర్షం నిలకడగా ఉంది. వర్షం ఇంట్లో కురుస్తున్నట్లే ఉంది. పెంకుటిల్లు వర్షానికి తడబడుతున్నట్లే ఉంది. పెంకుటిల్లు పైన అక్కడక్కడ గూన పెంకలు చెదరి ఉన్నాయేమో.. వాటి సందుల్లోంచి లోపలికి ధారగా కారుతున్నాయి నీళ్ళు. కారే నీళ్ళ దగ్గర పళ్ళాలు, గిన్నెలు పెడుతున్నారు అమ్మ, నానమ్మ. అరుగు ముందు తలుపులు లేకపోవడంతో జల్లు చల్లు లోపలికి విసిరి విసిరి కొడుతోంది.

"ఈ వర్షం ఈ రోజు వెలిసేటట్టు లేదు. ఎట్లనో ఏందో" బయటకు చూస్తూ అంది అమ్మ.

"వర్షం ఇట్లనే రెండు రోజులు కురుస్తది. మల్లా బడికెట్లా పోవాలో ఏందో" నశాన్ని ముక్కులో దట్టించి పీలుస్తూ అన్నాడు నాన్న భోజనం ముగించాక.

"ఇంత వర్షంల బడేందిరా? ఊరు గాని ఊరు ఎట్లా పోతవ్... రెండు రోజులు ఆగి పోదువులే" అంది నానమ్మ.


Scanned with CamScanner

ఎక్కడో గోడ కూలింది. పెద్దగా చప్పుడయింది.

"అది గోడా లేక దయ్యమా" నా అనుమానం.

"ఈ వానలో దయ్యాలెందుకు వస్తయ్.. పిచ్చిగాని పండుకోండిగ" అంటూ తన మంచం మీద ముసుగు తన్నాడు నాన్న.

"అన్నా! నీకు తెలుసా.. నాన్న సంచిలో కింద అరటి పళ్ళున్నాయ్" చెప్పింది అత్తుళ్ళాయ్ పొద్దున లేవగానే.

"అట్లనా, నేను చూస్నేలేదు" గబాల్న మంచం మీది నుంచి దిగాను నేను.

"వెళ్ళి మొహం కడుక్కోండి, తరువాత తిందురు" సంచి అడుగున చూస్తున్న నాతో, అత్తుళ్ళాయ్‌తో అంది అమ్మ.

అంత వరకు నిలకడగా కురిసిన వాన ముసురుగా మారి మెల్లి మెల్లిగా తెరపి ఇచ్చింది. తెల్లారే సరికి వర్షం దాదాపుగా తగ్గిపోయింది కాని, మబ్బులైతే దట్టంగా అలాగే ఉన్నాయ్.

బావిమీదకు వెళ్ళాం గబగబా.

బావిమీద ఒకచోట చక్కగా కడిగి కట్టెలబొగ్గు బండమీద రాస్తున్నాడు నాన్న. అట్లా కొంచెం సేపు రాసినాక పొడి తయారయింది. నాన్న, నేను, చెల్లి అక్కడే కూచొని ఆ బొగ్గు పొడితోనే పళ్ళు తోముకున్నాం.

చెల్లి నేను గబగబ మొహం కడుక్కున్నాం. మనసంతా అరటి పళ్ళ మీదే.

మొహం కడుక్కొని రాగానే అమ్మ పెద్ద గంజునిండా చాయ్ చేసి ఒక పెద్ద గ్లాసు నిండా పోసింది. తరవాత మూడు కప్పులు సాసర్లలో పెట్టి వాటి నిండా పోసింది.

పెద్ద గ్లాసు నానమ్మ తీసుకొని గబాగబా జుర్రసాగింది. నేను ఒక కప్పు, అత్తుళ్ళాయ్, నాన్న ఒక కప్పు తీసుకున్నాం. అమ్మ గాజు గ్లాసులో చాయ్ పోసుకొంది. నాన్న తల గుండ్రగా తిప్పుతూ, ఊదుతూ చాయ్ తాగేవాడు. మేమూ నాన్నలాగే చాయ్ సాసర్లలో పోసుకొని గుండ్రంగా తల తిప్పుతూ, గాలి ఊదుతూ (చాయ్ చల్లారాలని) చాయ్ జుర్రుకొన్నాం.

వర్షం మళ్ళీ మొదలయింది. క్రమంగా ఉధృతమై పెను వర్షంగా మారింది. జల్లులు లోపలికి విసిరి విసిరి కొడుతున్నై.

"అమ్మ ఇస్తుందేమో అరటి పండ్లు" అని కాసేపు చూసినం. ఇక ఉండబట్టలేక నేను, అత్తి మెల్లగా సంచి దగ్గరకు వెళ్ళి అరటి పళ్ళు తీసినం.

అందులో ఆరు అరటి పళ్ళున్నయ్. ఇంట్లో ఐదుగురం ఉన్నాం. ఒకటి మాత్రమే అదనంగా ఉంది.



Scanned with CamScanner

ఐదింటి నుంచి ఒకటి తీసి గబగబా తొడుగులు తీసి సగం సగం నోట్లో కుక్కుకున్నం.

"పోరగాండ్లు అరటి పండ్లు చూడనే చూసింద్రు. నేను ఇస్త అని చెప్పిన కద. ఎందుకు తొందర" అమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూ వచ్చింది.

"తెచ్చిందే పిలగాండ్ల కోసం. తిననియ్" అన్నాడు నాన్న.

నేను అరటి పండ్ల తొక్క చీల్చుతూ బయటికి విసురుతున్నాను. వాన నీళ్లలో తేలి పోతూ వరదలో కలిసిపోతున్నాయి అరటి తొక్కలు.

"నీళ్ళన్నీ నిలిచి పోతున్నాయి. పెద్దరువాజ దగ్గర తూపురం పనిచేస్తలేదేమో" నానమ్మ నిలువ అవుతున్న నీళ్ళను చూస్తూ అంది.

నాన్న దుప్పటి కప్పుకొని ఇనుప సలాక తీసుకొని బయటకు వెళ్ళాడు.

"అయ్యో, వాన. పదిలం, పదిలం" అమ్మ, నానమ్మ ఒకేసారి అన్నారు.

నేనూ వెళ్ళబోయాను.

"ఆగరా పిలగా, తడుస్తవ్" నానమ్మ నా చేయి పట్టుకుంది గట్టిగా.

నాన్న తూపురంలో సలాక పొడిచి అటూ ఇటూ తిప్పాడు. నీళ్ళు ధారాపాతంగా బయటకు వెళ్ళాయి. అరటి తొక్కలు కూడా నీళ్ళతో బయటకు వచ్చాయి.

నాన్న ఒక మహా వీరకార్యం చేసినట్టుగా లోపలికి వచ్చాడు.

"తడిసిపోయారు. బట్టలు మార్చుకోండి" అమ్మ తొందరతో నాన్న బట్టలు మార్చుకున్నాడు.

"ఇక అరటి పళ్ళు తిందామా."

"పోరగాళ్ళ కళ్ళన్నీ వాటిమీదే" నా మాటకు అమ్మ కాస్త విసుక్కుంటూ అరటి పళ్ళు తీసి తలా ఒకటి ఇచ్చింది.

అమ్మ, నానమ్మ, నేను, చెల్లి తలా ఒకటి తిన్నాం. అమ్మ, నానమ్మ కూడా నాలాగే అరటి తొక్కలు నీళ్ళలోకి విసిరారు.

నాన్నకు తడువడం వల్ల వణుకు వస్తుంది. తన అరటిపండును అలాగే మంచం మీద పెట్టి వణుకును నిగ్రహించుకున్నాడు.

మేం అందరం తినేశాం. నాన్న అరటి పండు మాత్రమే మిగిలింది. నేను చెల్లి ఆ వైపే చూస్తున్నాం.

చివరికి నేను అన్నాను, "నాన్న అరటి పండు తినడు, నాకే ఇస్తాడు"

చెల్లి వెంటనే అంది, "నీకెందుకిస్తాడు, నాకే ఇస్తాడు."

"లేదు.. నాకే"

"కాదు.. నాకే"



Scanned with CamScanner

"ఆగండి, పోరగాండ్లూ... ఇంట్ల గలవన్నీ మీకేనా? నాన్నను తిననీయండి" అంది అమ్మ.

నాన్న మా సంభాషణ ఏదీ వినడం లేదు. ఈ లోకంలోనే లేనట్టున్నాడు. బహుశ తాను ఇంతకు ముందు వర్షపు నీటిని తూపురం గుండా పంపించిన వీరోచిత చర్య గురించి ఆలోచిస్తున్నాడేమో. నీళ్ళన్నీ బయటకు పంపించిన ఘనత గురించి మురిసి పోతున్నాడేమో.

"అరటి పండు నాది" చెల్లి.

"కాదు నాది".

నాన్న అరటి పండు చేతిలోకి తీసుకున్నాడు. దాని పొట్టు తీశాడు.

మేం ఇద్దరం అటే చూస్తున్నాం.

"నాది."

"నాది" అంటున్నాం.

నాన్న ఇదేమీ వినిపించుకోకుండా అరటిపండు నోట్లో పెట్టుకున్నాడు.

"సగం తిని ఇస్తాడేమో" అనుకున్నాం.

నాన్న దృష్టి వర్షంమీద కాలువ మీదే ఉంది.

అలా అలా మొత్తం నాన్నే తినేశాడు. చివరి ముక్కలు తింటూ మా మాటలు విన్నాడు.

"నాది కాదు, నీది కాదు మొత్తం నాన్నే తినేశాడు" ఇద్దరం చప్పట్లు కొడుతూ అన్నాం.

"ఏమన్నారు, ఏమన్నారు" ఇద్దరిని చూస్తూ అడిగాడు.

"వాళ్ళకేంది, గట్లనే అంటరు తీయింౘ్రడి."

నాన్న, అమ్మ మాటలు వినలేదు.

"ఎంత పని జరిగింది? పిల్లలు అడుగుతుంటే వినకుండా నేను తింటిని కదా, ఎంత పొరపాటు జరిగింది. ఛ...ఛ.. ఏదో ఆలోచిస్తూ నేను తినేస్తిని కదా.."

"వాళ్ళవి వాళ్ళు తిన్నరు గద.."

నాన్న అమ్మ మాటలు అసలు వినలేదు. బయటకు చూశాడు. ఇపుడు యాకబెల్లి (అరటి పండ్లు అమ్మే వ్యక్తి పేరు) వస్తే బాగుండు, పిలగాండ్లు తిన్నన్ని కొనిస్తు.."

"గీ వానల వాడెట్ల వస్తడుర? వాన తక్కువయినంక సూత్తవులే."

నాన్న, నానమ్మ మాటలు అసలు వినలేదు.



Scanned with CamScanner

"లేదు, నేను జూస్త.. యాకబెల్లి ఎక్కడ దొరికిన కొనుక్కొస్త" నెత్తిమీద దుప్పటి కప్పుకొని గబగబా బయటకు నడిచాడు నాన్న.

అమ్మ, నానమ్మ ఎంత వారించినా వినలేదు నాన్న. భూమి అంతా బురద మయం, దరొదరి వాన.

మధ్యాహ్ననికల్లా పూర్తిగా తడిసిపోయి ఇంటికొచ్చాడు నాన్న.

నాన్నను చూస్తే మా అందరిలో ఏదో ఆందోళన.

"దీని తల్లి ముండమయ్య, యాకబెల్లి దొరకలేదు. అరటి పండ్లు దొరకలేదు" ప్రపంచ విజేత కాలేనని తెలిసిన అలెగ్జాండర్ గొంతులో కూడా అంత బాధ ఉండదు.

"దొరకక పోతే పోయినయ్, పాడు అరటిపళ్ళు" నాన్న ఒళ్ళు తుడుస్తూ అంది నానమ్మ.

నాన్న పిట్టలా వణికి పోతున్నాడు.

అమ్మ, నానమ్మ నాన బట్టలు మార్చారు. నాన్నకు రెండు, మూడు దుప్పట్లు కప్పారు. అయినా వణుకు తగ్గలేదు.

"రామచంద్రయ్యా, లేచి బుక్కెడంత దిను" నానమ్మ అడిగింది.

నాన్న వినిపించుకోలేదు.

"యాకబెల్లి వచ్చిందా, అరటిపండ్లు తెచ్చిండా? గోవర్ధనా, అత్తుళ్ళాయ్ అరటిపండ్లు దెస్త. తప్పక దెస్త, తెస్త" నాన్న కలువరిస్తూనే ఉన్నాడు. వణుకుతూనే అంటున్నాడు.

అమ్మ దుప్పటిలో చేయి పెట్టి చూసింది. నాన్న ఒళ్ళు విపరీతమైన జరంతో కాలపోతుంది.

"అయ్యో అత్తా, తనకు బాగా జరమొచ్చింది."

"ఆగు లలితా, నేను జూస్త" నానమ్మ వచ్చి చూసింది.

ఇద్దరూ ఆందోళనగా ఒకరినొకరు చూసుకొంటున్నారు.

నాన్న ఒళ్ళు తెలియని జరంతో కలవరిస్తున్నాడు.

"యాకబెల్లి అరటిపండ్లు. యాకబెల్లి. అరటి పండ్లు."

*14 ఏప్రిల్ 2013 బతుకమ్మ, నమస్తే తెలంగాణ*



Scanned with CamScanner